క్లుప్తంగా

నేడు భారీ అన్నసంతర్పణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (గేటు సెంటర్) వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి నేడు నిమజ్జనం నిర్వహించనున్నామని ఇందులో భాగంగా భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు శనివారం కమిటీ సభ్యులు తెలియజేశారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన సంతర్పణ నిర్వహిస్తామన్నారు. అనంతరం సాయంత్రం స్వామివారిని వీరభద్రుని నాట్యం, దాండియా, కోలాటం మధ్య నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ముందుగా స్వామి వారి లడ్డూకు వేలం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించవలసినదిగా కమిటీ సభ్యులు కోరారు.

పైపులైన్లకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గేటు సెంటర్ వద్ద తాగునీటి పైపులైను లీకును అరికట్టేందుకు శనివారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. 15 రోజుల నుంచి గేటు సెంటర్ వద్ద తాగునీటి పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా డ్రైనేజీలో కలుస్తుండడంతో పలుమార్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు కార్పొరేషన్ సిబ్బంది తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించారు.

రూ.65వేల విలువైన మద్యం పట్టివేత



మంగళగిరి: మంగళగిరి సెబ్ పోలీసులు రూ.65 వేల విలువైన అక్రమ మద్యం పట్టుకున్నారు. శనివారం సెబ్ సీఐ ప్రమీలారాణి తెలిపిన వివరాల మేరకు తుళ్ళూరు మండలం అనంతవరంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి టిఫిన్ హోటళ్లలో నరేష్, వెంకాయమ్మలు దుకాణాలలో అక్రమంగా నిల్వవుంచిన రూ.65 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులు, కార్యాలయ ఉద్యోగ సిబ్బందికి రక్తపోటు, మధుమేహం, కంటి, దంత పరీక్షలు చేపట్టి, మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని దేవ స్థానం సహాయ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో తులసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, వారాహి డెంటల్ క్లినిక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: మన జాతీయ భాష హిందీ దేశంలో మొదటి స్థానంలోనూ, ప్రపంచస్థాయిలో మూడోస్థానంలో నిలిచిందని కెనడి నెక్స్‌జెన్ పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, అన్నారు. అరండల్‌పేట 2వలైనులోని కెనడి నెక్స్‌జెన్, కెనడి ఇంగ్లిష్ మీడియం మెరిట్ క్యాంపస్ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీ భాషా గొప్పతనాన్ని డాక్టర్ శ్రీవిద్య వివరించారు. విద్యార్థులు హిందీ భాష నేర్చుకోవడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. పాఠశాల ఇన్‌చార్జి కె.వంసతలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాషతో పాటు ఇతర భాషలపై కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, హిందీ ఉపాధ్యాయురాలు ఎన్.డి.ఎల్.సుజాత, సుఫియా, మాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. రోగ నిలయాలు

- నగరంలో చిట్టడవులను తలపిస్తున్న ఖాళీస్థలాలు
- దోమలు, పందులకు నిలయాలుగా మారుతున్న వైనం
- తీసికట్టుగా పారిశుద్ధ్య నిర్వహణ
- ప్రబలుతున్న రోగాలు..ఆందోళనలో ప్రజలు



చిట్టడవులను తలపిస్తున్న ఖాళీస్థలాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆయా కాలనీలలో వున్న ఖాళీ స్థలాలు అడవులను తలపిస్తుండడం విశేషం. అడువులను తలపిస్తూ మురుగుకాలువలుగా మారిన ఖాళీ స్థలాల్లో దోమలు పెరిగిపోతున్నాయి. నగర శివారు కాలనీలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో ప్రజలు రోగాలపాలవుతున్నారు. మురుగుకాలువలలో తీసిన పూడిక కుప్పలు సైతం వీధులలో పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తుంది. దోమలు ప్రబలకుండా వినూత్న చర్యలు చేపట్టి నూతనంగా డ్రోన్ల సహకారంతో మందు పిచికారీ చేస్తున్నామని చెబుతున్నా ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న కంపచెట్లు మురుగునీరుతో సాధ్యపడడం లేదు. ఆవులు, కుక్కలు, దోమల నియంత్రణతో పాటు ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసి చదును చేసినప్పుడు మాత్రమే పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు...

నగర కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమలు నివారణకు డ్రోన్లను వినియోగించి పాడుబడిన బావులు, నీటి కాలువలలో మందు పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజులలో కుక్కలు, ఆవులను నగరం నుంచి తరలించడంతోపాటు, ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్షేత్రస్థాయిలో పర్యటనలేవీ..?

మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు తీసుకోవడం మినహా మూడు నెలలుగా నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన పరిస్థితి లేదు. ఇక స్థానిక నాయకులు ఎవరికి వారు సొంత పనులు చూసుకోవడం మినహా నగర పరిస్థితిపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. నగరంలో పారిశుద్ధ్య మెరుగుపరచి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాలంటే ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని నగర వాసులు కోరుతున్నారు.



గుట్టలుగా మురుగు కాల్వల్లోని సిల్టు

చిరస్మరణీయుడు సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిరస్మరణీయుడు అని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలో సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమాన్ని మండల నాయకుడు నల్లవు కిషోర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నాయకుడు జొన్న శివశంకరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యను అభ్యసించిన ఏచూరి మతోన్మాద శక్తులను వెనక్కి కొట్టేందుకు, తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం మార్క్సిజం అధ్యయనం చేసి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. 2005 సంవత్సరంలో పార్లమెంట్ సభ్యుడిగా అడుగుపెట్టి, కేంద్రంలో యూపీఏ-1 ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. పేద ప్రజలకు, వ్యవసాయ కార్మికులకు, గిరిజనులకు, సన్న చిన్నకారు రైతులకు ఉపయోగపడే అనేక చట్టాలు అమలు అయ్యేందుకు కృషి చేశారని అన్నారు. సీపీఐ తాడేపల్లి మండల సమితి నాయకులు కంచర్ల కాశయ్య, సీపీఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి గుడిసె శ్రీనివాసరావు, అమ్మిశెట్టి రామారావు, సహాయ కార్యదర్శి ఎస్కే గన్, నాయకులు గంపెన వెంకటేశ్వరరావు, కారసాల స్వాతి, గుడిసె ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రకాష్ నగర్‌లో నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో బి.వి.వి.దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, సిహెచ్ దుర్గారావు, వై.నరసింహారావు, వి.సావిత్రి, ప్రభాకర్, ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

రూ 1,56,000 పలికిన గణపతి లడ్డూ



రూ 1,56,000లు పలికిన లడ్డూ



జీఆర్ స్కూలు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

మంగళగిరి: పట్టణంలోని జీఆర్ స్కూలువద్ద గణపతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూకు శనివారం బహిరంగవేలం నిర్వహించారు. భక్తులు వేలంలో అధికసంఖ్యలో పాల్గొని లడ్డూని రూ.1,56,000కు దక్కించుకోగా నిర్వాహకులు అభినందించారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు

సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మలేరియా సిబ్బంది

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులన్ని పట్టణ సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో చెంచుపేటలో శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని చెప్పారు. ఇవి కుట్టడం వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎక్కువగా విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటివి వస్తాయని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టి వాటి సంతతిని పెంచుకుంటాయన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ దోమల వ్యాప్తి లేకుండా చూసుకోవాలని వివరించారు. అలాగే దోమల కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. పూర్తి వస్త్రధారణ ధరించడం వలన దోమలు కుట్టవని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దాసరి నాగమల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ నవీద్, షేక్ రషీదు, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాల సేవలో శ్రీశైల భక్తసేవాసమితి



పశుదాణా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ బి.జనార్ధనరావు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశైల భక్త సేవాసమితి స్వచ్ఛంద సేవాసంస్థ. గత 18 ఏళ్లుగా పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో ఏటా మహాశివరాత్రి పండుగకు స్వామి దర్శనానికి వచ్చే భక్తులు దాదాపు 80 వేలమందికి ఉచిత ప్రసాద వితరణ చేస్తోంది. ఇటీవల కృష్ణానది వరద ప్రభావిత లంక గ్రామాల్లోని ప్రజలకు 10 వేల ప్యాకెట్ల బిర్యాని, పెరుగుఅన్నం, మంచినీరు అందించింది.

ఈ క్రమంలో మూగజీవాలైన పాడిపశువుల ఆకలి తీర్చాలని కూడా భావించారు. అనుకున్నదే తడవుగా దాతల సహకారంతో 400 మంది పాడిరైతులను ఎంచుకున్నారు. ఒక్కో పాడిరైతుకు 25 కిలోల మినపపొట్టు, 25 కిలోల కామధేను మిక్చర్, రెండు కిలోల బెల్లం చొప్పున ప్యాకెట్లను తయారుచేసి లంక గ్రామాలకు తరలించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు శనివారం ఉదయం పశుదాణా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. లంక గ్రామాలైన ఆవులవారపాలెం, ఈపూరులంక, ములకపల్లి లంక, కొత్తూరులంక, అన్నవరపులంక, కనిగిరిలంక గ్రామాల్లో పంపిణీ చేశారు.

కొల్లిపర వండల గ్రామం అన్నవరపు లంక, కొత్తూరులంకలో పశుదాణాను ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో వి.విజయలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. వరద బీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వంతోపాటు సేవా సంస్థలు, ట్రస్టులు తమవంతు సాయం చేసి ఆదుకోవాలని ఆమె కోరారు. శ్రీశైల భక్త సేవా సమితి, తెనాలి అధ్యక్షుడు ఆళ్ల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వరదల వంటి ప్రకృతి విపత్తు సమయాల్లో బాధితులను ఆదుకునేందుకు తమ సేవాసమితి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. పాడిరైతులు అధైర్యపడొద్దని చెప్పారు. సేవా సమితి సభ్యులకు గ్రామస్తులు తమ వంతు కృతజ్ఞతలు తెలియజేశారు. సమితి సభ్యులు పరిమి గోవర్ధన్, కోన బ్రహ్మానంద గుప్త, కొడాలి భారతి, వెంపటి రవీంద్ర, తుమ్మల రామకృష్ణ, నక్కా వేణుగోపాల్, బి.భాస్కరరావు పర్యవేక్షించారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

మంగళగిరి: ముఖ్యమంత్రి సహాయనిధికి రాష్ట్ర ఆరె కటిక సంఘం అధ్యక్షుడు కోవెలకోరు శివరామ్‌బాబాజీ కలిసి రూ.లక్ష అందజేశారు. పట్టణంలోని మెయిన్‌బజార్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు శనివారం చెక్కు అందజేశారు. రత్నాలచెరువులో ముంపు బాధితులకు అరకు తారకరామా ఆర్గానిక్స్ సుజాత ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 120 మంది బాధితులకు 10 రకాల నిత్యావసరకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గానిక్స్ అధినేత గరికపాటి రామకృష్ణ, స్థానికులు విజయసారథి, వెంకాయమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

70 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: తుళ్లూరులో 70 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. బొలేరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ జి.అంకమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించగా, 3వేల కిలోల రేషన్ బియ్యం గుర్తించి, వాహనంతోపాటు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 188 కేసులు పరిష్కారం

మంగళగిరి: మంగళగిరి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 188 కేసులు పరిష్కారం అయ్యాయి. ఓఎస్‌లు 10, ఈపీ 01, ఐపీసీ సీసీలు 138, చెక్కు బౌన్స్ కేసులు 14, మనోవర్తి కేసులు 03, గృహహింస కేసులు 03, పీఎల్‌సీలు 14, ఎన్‌టీసీలు 05 పరిష్కారమయ్యాయి. మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి మొదటి లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజా, సభ్యులు టి.మధుసూధనరావు, 2వ బెంచ్‌లో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, సభ్యులు దొడ్డక శ్రీనివాసరావు, 3 బెంచ్‌లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు, సభ్యులు కె.బాజీగంగాధరరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమర కళాకారుల సంస్మరణ

తెనాలి: మహిళలు బయటకు రాలేని పూర్వం రోజుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదిరించి, గ్రామగ్రామాన ప్రజాచైతన్య ప్రదర్శనలిచ్చిన వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సౌమిత్రి చిరస్మరణీయులని శనివారం సాయంత్రం జరిగిన అమరకళాకారుల సంస్మరణ సభలో పలువురు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఇస్కఫ్ హాలులో ఏర్పాటైన సభకు సినీ డబ్బింగ్ కళాకారిణి వాల్మీకి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. గాయని అనూరాధ, విద్యార్థి నేత మౌనిక, అన్నమాచార్య ప్రాజెక్ట్ గాయని వీణ, విజయదుర్గ, యోగ్న సహస్ర శ్రీరాం, చందు సూర్య, బొల్లిముంత కృష్ణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

- వినతి పత్రం అందజేత



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

లక్ష్మీపురం: ఇప్పటి వరకు కేఆర్ సూర్యనారాయణ సారథ్యంలో పని చేసిన జిల్లా సంఘం అధ్యక్షుడు జారీ చేయబడిన ఉద్యోగుల బదిలీలలో మినహాయింపు ధ్రువ పత్రాలను ఆమోదించ వద్దని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా కార్యదర్శి అమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీజీఈఏ సంఘం నుంచి వారిని బహిష్కరించిన తరువాత ప్రస్తుతం డి.శ్రీకాంత్ రాజు, జి.ఆస్కార్ రావు నేతృత్వంలో పని చేస్తున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారిని కలవడం జరిగిందన్నారు. అంతేకాకుండా గతంలో కూడా ఇదే విధంగా ఉద్యోగుల బదిలీలలో మినహాయింపు ధ్రువ పత్రాలు జారీపై, ఆరేళ్లుగా సంఘం పేరుతో వసూలు చేయబడి నిధుల తాలూకా ఖర్చులలో అవకతవకలపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, శేషారావు, మహేష్, సుజాత, సాంబశివరావు, భరత్,షఫీ హమ్మద్, రమేష్,జిలాని,శ్యామ్ పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయుల పరస్పర ఫిర్యాదులు

ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసులు నమోదు

తాడేపల్లిరూరల్: పెనుమాక గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఒకరిపై ఒకరు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన ఘటనపై తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాసరావు ఇరువర్గాలపై శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. టీడీపీ నాయకురాలు నెమలికంటి అనూష, వీరాంజనేయులు భార్యాభర్తలు. పెనుమాకలో వీరి ఇంటివద్ద నివాసముండే అదేపార్టీకి చెందిన కోట పృథ్వీ, స్టాలిన్‌లు తమపై దాడి చేశారని, తనపై అసభ్యంగా ప్రవర్తించారని అనూష ఫిర్యాదు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పృథ్వీ, స్టాలిన్‌లతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కోట పృథ్వీ, స్టాలిన్‌లను తమపై వీరాంజనేయులు, అతని భార్య అనూషతో పాటు మరో నలుగురు దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై కూడా కేసు నమోదు చేశామని ఈ రెండు కేసుల్లో మొత్తం 14 మంది ఉన్నారని, ఇందులో ముగ్గురు మహిళలు కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సుబ్రహ్మణ్యం

తెనాలిఅర్బన్: శ్రీ స్వామి జ్ఞాన ప్రసన్న పిలుపు మేరకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో తెనాలి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ సోకిన చిన్నారులకు పోషకాహారం కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి.జనార్ధనరావు, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50మంది చిన్నారులకు శనగలు, కందిపప్పు, రాగిపిండి, గోధుమలు, బెల్లం వంటి వాటిని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ, తుల్లిమిల్లి పోతురాజు, అక్కల రమేష్, కుర్రా శ్రీనివాసరావు, బాణవత్ బాలు నాయక్, గుమ్మడి నారాయణ, తుల్లిమిల్లి చంటి, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడం సామాజిక బాధ్యత



విజయవాడకు బయల్దేరిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేవీ బ్రహ్మం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ వరదల కారణంగా ఎంతో నష్టపోయిన ప్రజలకు సహాయ చర్యలు చేయడం సాటి మనుషులుగా కనీస బాధ్యత మనపై ఉందన్నారు. మనకు ఉన్నంతలో తోటివారికి సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జీవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి పి.కుమార్ రాజా, ఆర్. జయశైలజ పాల్గొన్నారు.

గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి..

గ్రంథాలయ ఉద్యమనేత గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గ్రంథాలయం ఉండాలని, తద్వారా ప్రజల్లో నిరక్షరాస్యత తొలగిపోయి అభివృద్ధిలో నడుస్తున్నారని చెప్పారు.

తెనాలి అధ్యాపకుడికి పీహెచ్‌డీ



గొరికపూడి సతీష్

తెనాలి: పట్టణ అయితానగర్‌కు చెందిన గొరికపూడి సతీష్ వీఐటీ యూనివర్శిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. కేఎల్ యూనివర్శిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న సతీష్, 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆప్టిమల్ క్లస్టరింగ్ అండ్ రూటింగ్ మెకానిజమ్స్ ఫర్ ఇంప్రూవింగ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టర్ హరికిషన్ కొండవీటి గైడ్‌గా వ్యవహరించారు. సతీష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి వీఐటీ యూనివర్శిటీ పీహెచ్‌డీని బహూకరించినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అయనను పలువురు అభినందించారు.